మైనర్ డ్రెయిన్‌లకు మోక్షం

- ఆధునీకరణకు రూ.46 లక్షలు మంజూరు చేసిన కలెక్టర్
- 1400 ఎకరాల ఆయకట్టుకు తీరనున్న ముంపు బెడద


పూడిక తొలగించక ముందు బెండా నార్త్ మైనర్ డ్రెయిన్ పరిస్థితి


కొమరగిరిపట్నంలో పూడిక తొలగించి ఆధునీకరించిన బెండా నార్త్ మైనర్ డ్రెయిన్

అల్లవరం: సంవత్సరాల తరబడి ఆధునీకరణకు నోచుకోక ముంపు నీరు దిగేందుకు తీవ్ర ప్రతిబంధకంగా మారిన మైనర్ డ్రెయిన్‌లకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవతో మోక్షం లభిస్తుంది. రెవెన్యూ, మైనర్ డ్రెయిన్‌ల ఆధునీకరణ విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అల్లవరం మండలంలో కొమరగిరిపట్నం, తుమ్మలపల్లి, మొగళ్లమూరు గ్రామాల్లోని వందలాది ఎకరాల్లో ముంపుబారిన పడుతున్నాయి. కొమరగిరిపట్నం బెండకాలువ 1, 2 పరిధిలో పంచనీటి కాలువ నుంచి వచ్చే ఉప్పు జలాల కారణంగా వందలాది ఎకరాల్లో గత రెండేళ్లుగా వరి సాగు మానేశారు. ఐదారు సంవత్సరాలుగా ఖరీఫ్ పంట కనుమరుగైంది. భారీ వర్షాలు, ఆక్వా చెరువుల కారణంగా ముంపు నీరు దిగే దారి లేక పూడికతో నిండిపోయిన మైనర్ డ్రెయిన్లను ఆధునీకరించాలని పలువురు రైతులు జిల్లా కలెక్టర్, డ్రెయిన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా రూ.46 లక్షలు నిధులు మంజూరు చేశారు.

ప్రారంభమైన పనులు

- బెండమూర్లంక నుంచి ఎస్.రామేశ్వరం స్లూయిజ్ వరకు 4.87 కిలోమీటర్ల పొడవునా బెండానార్త్ మైనర్ డ్రెయిన్ పనులకు రూ.25 లక్షల నిధులు కేటాయించడంతో వారం రోజులుగా ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.
- మొగళ్ళమూరు నుంచి గుండెపూడి లోయర్ కౌశిక వరకు 4.97 కిలోమీటర్ల మేర శిరగట్లపల్లి మైనర్ డ్రెయిన్ పనులకు రూ.15 లక్షలు కేటాయించడంతో ఇటీవలే పనులు ప్రారంభించారు.
- బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకూ 3 కిలోమీటర్ల మేర రూ.6 లక్షల నిధులతో ఇప్పటికే ఆధునీకరించి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.
- ఈ మూడు మైనర్ల డ్రెయిన్‌ల ఆధునీకరణలతో కొమరగిరిపట్నం, బెండమూర్లంక, మొగళ్ళమూరు, తుమ్మలపల్లి, శిరగట్లపల్లి గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ముంపు బెడద తప్పుతుంది.

ఈ నెల చివరి నాటికి డ్రెయిన్ల ఆధునీకరణ పూర్తయితే ఆయకట్టుకి ముంపు సమస్య తీరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముంపు సమస్య తీరుతుంది



బెండానార్, శిరగట్లపల్లి మైనర్ డ్రెయిన్, చంచులా మైనర్ డ్రెయిన్‌లను ఆధునీకరించడంతో ఐదు గ్రామాల్లో 100 శాతం ఆయకట్టుకి ముంపు బెడద తీరుతుంది. క్షేత్రస్థాయిలో మేము చేసిన సర్వే ఆధారంగా గత ఇరవై ఏళ్ల కాలంలో రెండు పర్యాయాలు పూడిక తీశారు కాని పూర్తి స్థాయిలో జరగలేదు. బెండానార్త్ డ్రెయిన్ వెడల్పుగా ఉండదంతో పంటిపై ప్రొక్లెయిన్ ఉంచి పూడిక తీసేందుకు కార్యచరణ చేశాం. ఖరీఫ్ ప్రారంభం నాటికి పనులు పూర్తిచేస్తాం.

– ఎంవీవీ కిషోర్, డీఈఈ, డ్రెయిన్స్

క్లుప్తంగా

వేసవి వినోద కేంద్రం ఏర్పాటు


వేసవి వినోద కేంద్రంలో బాలల సందడి

ముమ్మిడివరం: ముమ్మిడివరం రవీంద్ర ప్రైమరీ స్కూల్లో జనవిజ్ఞాన వేదిక, జిల్లా బాలల సంఘం ఆధ్వర్యంలో వేసవి వినోద కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. కేంద్రంలో విద్యార్థులకు వారం రోజుల పాటు వినోదం, ఆటలు, పాటలు, సైన్స్ మేజిక్ వంటివి నేర్పుతామని నిర్వాహకులు తెలిపారు. వినోదంతో కూడిన విజ్ఞానం అందించడానికే వేసవి వినోద కేంద్రాన్ని ఏర్పాటు చేశామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జె.సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ, జిల్లా అకడమిక్ కన్వీనర్ ఎస్.అబ్బులు, పి.మురుగేశ్వరరావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

27న అవగాహన సదస్సు

తాళ్లరేవు: మండల పరిధిలోని జాతీయ రహదారి–216లో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణపై ఈ నెల 27వ తేదీ శనివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీపీ రాయుడు సునీత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఉదయం 9 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందన్నారు. జాతీయ రహదారి నిర్మించిన అనంతరం చొల్లంగి నుంచి ఎదుర్లంక వంతెన వరకు జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృతిచెందారని చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారన్నారు.

కుటుంబరావుకు సత్కారం


కుటుంబరావుకు బుద్ధుని ప్రతిమను అందజేస్తున్న ఎండీయూడబ్ల్యూఏ ప్రతినిధులు

తాళ్లరేవు: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన న్యాయవాది యడ్ల కుటుంబరావును మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద ఎండీయూ డబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కుటుంబరావును దుశ్శాలువాతో సత్కరించి బుద్ధుని ప్రతిమను బహూకరించారు. కార్యక్రమంలో రెడ్డి రెడ్డిబాబు, గిరిబాబు, వడ్డి ఏడుకొండలు, తాడి షణ్ముఖరాజు, వాకపల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూడబ్ల్యూఏకి ఫ్రీజర్ బహూకరణ


ఫ్రీజర్‌ను బహూకరిస్తున్న సత్యనారాయణ కుటుంబసభ్యులు

తాళ్లరేవు: ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుడు మాసాబత్తుల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు రూ.లక్ష విలువైన ఫ్రీజర్‌ను ఎండీయూడబ్ల్యూఏకు బహూకరించారు. స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ కుటుంబ సభ్యులు త్రివేన్, సామంత్, సురేష్‌బాబు, సుధీర్‌బాబులు ఫ్రీజర్‌ను ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. కార్యక్రమంలో రమేష్, రెడ్డి గిరిబాబు, రెడ్డిబాబు, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు, తాడి షణ్ముఖరాజు తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ విజేత శ్రీలక్ష్మీరమణికి సత్కారం


సివిల్స్ విజేత శ్రీలక్ష్మీరమణిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న అబ్బిరెడ్డి సురేష్

అమలాపురం రూరల్: సివిల్స్ ఫలితాల్లో 583 ర్యాంకు సాధించిన మామిడికుదురు మండలం ఈదరాడ గ్రామానికి చెందిన యర్రంశెట్టి ఉమా శ్రీలక్ష్మీ రమణిని కోనసీమ కాపునాడు సంఘం అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్, ఆకుల ఈశ్వరరావు, కాకిలేటి దుర్గారావు, అబ్బిరెడ్డి మూర్తి తదితరులు గురువారం కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియచేశారు.

వృద్ధాప్య పింఛన్ల మంజూరు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా 1060 మందికి పింఛన్లు మంజూరైతే, దాంట్లో యానాంలో 252 మంది మత్స్యకారులకు పింఛను అవకాశం కల్పించిన సీఎం రంగసామి, ఎల్జీ తమిళిసై సౌందరరాజన్, మంత్రి లక్ష్మీనారాయణలకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు గురువారం కృతజ్ఞతలు తెలియజేశారు. మార్చి, ఏప్రిల్ మాసాల పింఛను నగదును ఆయా వృద్ధాప్య పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. కొత్తగా పింఛను మంజూరైన నూతన లబ్ధిదారుల ఖాతాల్లో జూన్ మొదటి వారంలోగా నగదు జమ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

ఎండ తీవ్రతకు చేపలు మృత్యువాత


గొల్లవిల్లి రజక చెరువులో మృత్యువాత పడిన చేపలు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఉన్న రజక చెరువులో ఎండ తీవ్రతకు ఆక్సిజన్ శాతం పడిపోవటంతో చేపలు మృత్యువాతపడ్డాయి. చేపలు చనిపోవటంతో విపరీతమైన దుర్వాసన వస్తుందని స్థానికులు సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపీడీవో గౌరీకుమారి దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో కార్యదర్శి పరమట సాయిబాబు వెంటనే వాటిని పారిశుధ్య సిబ్బందితో తొలగించి చర్యలు తీసుకున్నారు.

ఎన్నికల హామీలన్నీ అమలు చేశాం


లబ్ధిదారునికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ని అందిస్తున్న శ్రీకాంత్

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- ఎంట్రుకోనలో గడప గడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఎంట్రుకోన గ్రామంలో గురువారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడు పినిపే శ్రీకాంత్‌తో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నాటి నుంచి నేటి వరకూ 95 శాతం హామీలను అమలుచేశారని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇవ్వని హామీలను సైతం అమలుచేశారని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రారంభించి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం శ్రీకాంత్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఉల్లింగివారిపేటలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి జీజీఎం నిధులు మంజూరు చేశామని శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్ తిక్కిరెడ్డి నాగ వెంకట శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుంచే చిన సత్యనారాయణ, మండల నోడల్ అధికారి జి.సరోవరావు, మాజీ సర్పంచ్‌లు మొల్లేటి సాయిబాబు, తిక్కిరెడ్డి సత్యనారాయణ, శ్రీమన్నారాయణ, మాజీ ఎంపీటీసీ సాపే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు


స్వామికి శాంతి కల్యాణం జరిపిస్తున్న పండితులు

అమలాపురం రూరల్: భట్లపాలెంలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో విగ్రహ, యంత్ర ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీమాన్ సుదర్శనం వెంకట జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో పండితులు పూర్ణాహుతి, రత్నన్యాసం, గోదృష్టి, కళావాహన, శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, విశ్రాంత ఈవో శిరగం రామలక్ష్మణరావు, సర్పంచ్ చొల్లంగి శివాలిని, ఎంపీటీసీ సభ్యుడు కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు సంక్షేమ వారధులు


వలంటీర్లకు అవార్డు అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

- వలంటీర్ల సన్మాన సభలో ఎమ్మెల్యే పొన్నాడ

ఐ.పోలవరం: వలంటీర్లు సంక్షేమ వారధులని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఐ.పోలవరం మండల కేశనకుర్రుపాలెం క్షత్రియ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తొలుత మండలంలో ఒకరికి సేవ వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 321 మందికి సేవా మిత్ర అవార్డులు అందించి వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా వారి ఇంటికి చేరవేస్తున్న వలంటీర్ల సేవలను ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్య, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమివ్వడమే కాకుండా పారిశ్రామిక రంగంలోను ఒక నూతన ఒరవడి తీసుకొచ్చారన్నారు. నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని మరో ఏడాది పాలనలో మరింత మంచి చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త మిరియాంజ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, మండల పార్టీ కన్వీనర్ పిన్నమరాజు వెంకట పతిరాజు, ఢిల్లీ నారాయణ, మెండా వెంకన్నబాబు, పెన్మత్స వాసురాజు, బాబ్జీరాజు, కాలే రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకందారులకు నోటీసులు

సాక్షి ఇంపాక్ట్


చల్లపల్లిలో అనధికారికంగా తవ్వుతున్న చెరువుల్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లిలో అనధికార ఆక్వా చెరువు తవ్వకాలపై 'కళ్లు మూసుకున్నాం.. తవ్వేసుకోండి..' శీర్షికన గురువారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, మత్స్యశాఖాధికారి ఎన్.నాగమణిలు గురువారం క్షేత్రస్థాయిలో అనధికారికంగా తవ్వుతున్న చెరువులను పరిశీలించి అక్రమాల్ని గుర్తించారు. దీనిపై తహసీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ చల్లపల్లిలో 24.5 ఎకరాల మేర అక్రమ ఆక్వా చెరువుల తవ్వకాలను గుర్తించామన్నారు. ప్రస్తుతం అక్కడ ఎటువంటి ప్రొక్లెయిన్‌లు లేవని, ఉండుంటే సీజ్ చేసేవాళ్లమన్నారు. మత్స్యశాఖాధికారి నాగమణి మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఆ ప్రాంతంలో ఏ ఒక్క రైతుకు కూడా మేము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు జరుపుతున్న రైతులకు నోటీసులు జారీ చేస్తామని, ఇకపై తవ్వితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా గో గ్రహ నక్షత్ర శాంతి హోమం

అమలాపురం టౌన్: స్థానిక వేద మాత గాయత్రి దివ్య భవ్య సాధనా మందిరం గీతాశ్రమ ప్రాంగణంలో లక్ష గో పిడకలతో జరుగుతున్న సురభి–గోరక్ష దీక్షా యాగంలో మూడో రోజు గురువారం గో గ్రహ నక్షత్ర శాంతి హోమం వైభవంగా సాగింది. 108 గో గాయత్రి నామ జపంతో ప్రతి వ్యక్తి 108 గో పిడకలతో హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని యాగాన్ని వీక్షించారు. మహీ ట్రస్ట్ చైర్మన్ కుందుర్తి మహీ కిరణ్‌శర్మ, వేదమాత ట్రస్ట్ చైర్మన్ ఆకుల బాబి, కార్యదర్శి కోకా రాంబాబు యాగాన్ని పర్యవేక్షిస్తున్నారు.

ప్రమాదకరంగా వంతెన.. వాహనదారుల అవస్థలు


గొల్లలరేవు వంతెన వద్ద వెనక్కి జారిపోతున్న ఆటోను తోస్తున్న స్థానికులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు, కాజులూరు మండలాలను అనుసంధానం చేస్తూ గొల్లలరేవు వద్ద ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. వంతెన ఎత్తు ఎక్కువగా ఉండడంతో వాహనాలు వెనక్కి జారిపోతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన నిర్మాణంలో ఇంజినీరింగ్ లోపాల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా లోడు వాహనాలు వంతెన పైకి వచ్చే సమయంలో తరుచూ వెనక్కి జారిపోతున్నాయి. దీంతో ఆయా వాహనాల వెనుక వచ్చే ప్రజలు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. కాజులూరు వైపు శీల్లంక, ఒంటితాడి, కోరంగి పంచాయతీ బొడ్డువానిలంక, పాతకోరంగి తదితర గ్రామాల ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం అనేక మంది ప్రయాణిస్తుంటారు. ఈ రహదారి వెంబడి వేలాది ఎకరాల వ్యవసాయంతో పాటు ఆక్వా చెరువులు అధికంగా ఉన్నాయి. దీంతో అటు ధాన్యం లోడుతో వెళ్లే వాహనాలతో పాటు ఇటు ఆక్వాకు సంబంధించిన మేత, రొయ్యలు, చేపల ఉత్పత్తులను తరలించేందుకు అనేక వాహనాలు సంచరిస్తుంటాయి. అయితే ఆయా వాహనాలు వంతెన పైకి ఎక్కేటపుడు అకస్మాత్తుగా వెనక్కి జారిపోతుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వెనక్కి జారిపోయిన వాహనాలను మరొక వాహనం సహాయంతో తాడు కట్టి లాగాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల తాత్కాలికంగా కొంత లెవలింగ్ పనులు చేసినా ఫలితం లేదని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బాధిత కుటుంబానికి రూ.10 వేల నగదు అందజేస్తున్న సర్పంచ్ టేకిళ్లపూడి నాగేశ్వరరావు తదితరులు

తాళ్లరేవు: సుంకరపాలెం అంబేడ్కర్ నగర్‌కు చెందిన బుజ్జిబాబు(48) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. బుజ్జిబాబు కుటుంబసభ్యులను మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు టేకిళ్లపూడి నాగేశ్వరరావు పరామర్శించి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ బీమాలో భాగంగా మరో రూ.90 వేలు నామినీ ఖాతాకు త్వరలోనే జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, పలివెల రాము, మడికి సత్యనారాయణ, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.

30న కాకినాడ తరలిరండి

తాళ్లరేవు: ఉపాధి హామీ చట్టం రక్షణ, సమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీన కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తరలిరావాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు తదితరులు కోరంగి తదితర గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. 30న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.తణుకురాజు, రాంబాబు, మంగ, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో ఔషధీకృత రాగి జావ


అక్షయపాత్ర చలివేంద్రం వద్ద రాగి జావ కోసం ప్రజల సందోహం


రాగిజావ తయారుచేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు

అమలాపురం టౌన్: చలి వేంద్రం అంటే చల్లని తాగు నీరు లేదా మజ్జిగ ఇస్తారు. చలివేంద్రంలో ఔషధ విలువలున్న రాగి జావ ఇవ్వడం బహు అరుదే. స్థానిక నల్ల వంతెన–ఎర్ర వంతెన మధ్య బైపాస్ రోడ్డు చెంత గల శ్రీదక్షిణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌లో శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో రోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ చలి వేంద్రంలో మంచినీరు, మజ్జిగతో పాటు రాగి జావను సైతం అందిస్తున్నారు. అక్షయ పాత్ర సభ్యులంతా పూనుకుని అల్లం, పచ్చిమిర్చి, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, జీలకర్ర, మిరియాలు, సబ్జా గింజలు, చోళ్ల పిండి, నిమ్మరసం, లవణం, పెరుగు మిశ్రమాలతో ఎప్పటికప్పుడు రాగి జావను తయారు చేసి నిత్యం సుమారు 2500 మంది పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నారు. బైపాస్ రోడ్డు మీదుగా వెళ్లే ఎవరైనా ఆగి రాగి జావ తాగి వెళ్లేటంత ప్రాధాన్యతను ఈ చలివేంద్రం సంతరించుకుంది. రోజుకు సుమారు రూ.6 వేల వ్యయంతో రాగి జావ, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. కొందరు దాతలు ముందుకొచ్చి రోజుకు రూ.3 వేలు విరాళంగా ఇచ్చి పంపిణీలో భాగస్వామ్యం అవుతున్నారు. అక్షయ పాత్ర సభ్యులు టి.అన్నపూర్ణ, పోతురాజు నాగ కనకదుర్గ, చాగంటి నాగదుర్గ, లింగోలు శిరీష, నల్లా శ్రీదేవి, చాగంటి వరప్రసాద్, అరిగెల బుజ్జి రాగిజావ తయారీలో పాలు పంచుకుంటున్నారు.

మావుళ్ళమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన


ఇందుపల్లి గ్రామదేవత మావుళ్ళమ్మ తల్లి

అమలాపురం రూరల్: మండలంలోని ఇందుపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత మావుళ్ళమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం ఘనంగా నిర్వహించారు. శైవాగమ పండితులు బాదంపూడి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

కోనసీమ రైలు కోసం విద్యార్థుల ర్యాలీ

- పాల్గొన్న ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, వెంకటేశ్వరరావు


కోనసీమ రైలు కోసం ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: కోనసీమ రైలు కోసం కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణ పుర వీధుల్లో గురువారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. నత్తనడకన నడుస్తున్న రైల్వే నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్న డిమాండ్‌తో విద్యార్థులు ర్యాలీలో డిమాండ్ చేశారు. ర్యాలీలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావులు పాల్గొని కోనసీమ రైల్వే పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. కోనసీమ నుంచి తమ అన్వేషణలు, కార్యకలాపాల ద్వారా రూ.కోట్ల ఆదాయం సముపార్జిస్తున్న చమురు సంస్థలు రైలు లైన్ నిర్మాణానికి తమ వంతు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కోరారు. స్థానిక హైస్కూలు సెంటరు నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, సప్పా నాగేశ్వరరావు, ఆర్వీ నాయుడు, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మిరియాం కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు

అమలాపురం టౌన్: స్థానిక నల్ల వంతెన వద్ద గల మిరియాం డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు లభించిందని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కార్ల్ డేవిడ్ కొమానపల్లి గురువారం తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని అక్రిడిటేషన్స్ సాధిస్తామని ఆయన పేర్కొన్నారు. ఐఎస్ఓ గుర్తింపు రావడంపై కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన: కాట్రేనికోన సబ్ స్టేషన్ 33/11 కేవీ ఫీడర్, 11 కేవీ బంటుమిల్లి ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమత్తుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అమలాపురం డీఈ మోకా రవికుమార్ పేర్కొన్నారు. కాట్రేనికోన, నడవపల్లి, కుండలేశ్వరం, గెద్దనపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, పల్లం, కందికుప్ప, పల్లంకుర్రు, బలుసుతిప్ప, చెయ్యేరు అగ్రహారం, పెనుమల్లే, సావరం, లక్ష్మీవాడ, ఉప్పూడి, వేట్లపాలెం, అడవిపేట, గచ్చకాయలపోర తదితర గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ నిలిచిపోతుందన్నారు.

75 మందికి స్టడీ మెటీరియల్ అందజేత


యూడీసీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి ఆదిద్రావిడ, షెడ్యూల్ట్ ట్రైబ్స్ అభివృద్ధి సంస్థ యానాం ప్యాడ్కో ద్వారా ఉచిత శిక్షణ పొందిన 75 మంది అభ్యర్థులకు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. స్థానిక గోపాల్ నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞానభవన్‌లో యూడీసీ పోటీ పరీక్షకు సంబంధించి 60 రోజుల పాటు ఉచిత శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సుమారు రూ.65,625 విలువ చేసే స్టడీమెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ప్యాడ్కో ఫీల్డ్ ఆఫీసర్ సూరిమిల్లి వెంకట్రావు, అసిస్టెంట్ నల్లా సూర్యప్రకాశరావు, సూపర్‌వైజర్ దొమ్మేటి శ్రీనివాసరావు, పీఏ ప్రసాద్, మట్టపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.